## క్లుప్తంగా

### సంక్రాంతి శుభాకాంక్షలు


ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

**పులివెందుల :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందడంతో నూతన సంవత్సర ఆరంభానికి ముందే జిల్లాలో సంక్రాంతి కళ సంతరించుకుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. భోగి మంటల వెచ్చటి వెలుగులు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని.. మకర సంక్రాంతి కాంతులతో ప్రతీ ఇళ్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

**కమలాపురం :** నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోశాలతో సంక్రాంతి పండుగ నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

### రాబోయే ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేద్దాం

**జమ్మలమడుగు :** రాబోయే సాధారణ సార్వత్రిక ఎన్నికల్లో అన్ని విభాగాలతో కలిసి సమర్థవంతంగా పనిచేద్దామని ఇన్‌చార్జి డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్‌ఐలతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు, గ్రామాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. పట్టణ శివార్లు, నియోజకవర్గ సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను చేయాలన్నారు.

### తొండూరు ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ



**తొండూరు :** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తొండూరు ఎస్‌ఐగా పనిచేస్తున్న హనుమంతు జమ్మలమడుగు నియోజకవర్గంలోని తలమంచిపట్నం ఎస్‌ఐగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో సిద్ధవటంలో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ తొండూరు ఎస్‌ఐగా వచ్చారు.

### అంబటి గోపాల్ మృతి తీరని లోటు

**పులివెందుల :** ప్రొద్దుటూరుకు చెందిన కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అంబటి గంగ గోపాల్ శనివారం మృతి చెందారు. ఆయన మృతి తీరని లోటు అని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి మిట్టా కరుణాకర్ శ్రేష్టి, కడప జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తూరు రవి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు శ్రీహరి, గంగాధరలు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన జిల్లాలో ఆర్యవైశ్యులకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని వారు ఆకాంక్షించారు.

### వినాయకుడికి రూ.లక్ష విరాళం


నిత్య అన్నదానంకు రూ.లక్షను ఆలయ అధికారులకు అందిస్తున్న వెంకటరెడ్డి

**కాణిపాకం(యాదమరి) :** కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి ఎర్రగుంట్లకు చెందిన వెంకటరెడ్డి స్వామివారి నిత్య అన్నదానంకు రూ.లక్ష విరాళంను ఆలయ అధికారులకు శనివారం అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విగ్నేస్, రమేష్ పాల్గొన్నారు.

**గండిలో..**


నిత్యాన్నదానానికి రూ.లక్ష అందజేస్తున్న మిట్టా మల్లికార్జునశ్రేష్టి కుటుంబ సభ్యులు

**చక్రాయపేట :** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం గండి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పులివెందులకు చెందిన మిట్టా మల్లికార్జునశ్రేష్టి తన తండ్రి మిట్టా నారాయణశ్రేష్టి, తల్లి ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి, మల్లికార్జునశ్రేష్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కళలకు పుట్టినిల్లు సురభి నాటకాలు


కళా వేదిక వద్ద జ్యోతి ప్రజ్వలనగావిస్తున్న పాడా ఓఎస్డీ, మున్సిపల్ ఇన్‌చార్జి


మాయాబజార్ నాటక ప్రదర్శనలో సురభి కళాకారులు

**పులివెందుల టౌన్ :** చక్రాయపేట మండలం సురభి గ్రామంలో ఏర్పడిన సురభి నాటకాలు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక గరండార్ రివర్ ఫ్రంట్(రాణితోపు)లో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆరు రోజులపాటు సురభి నాటకాలు ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా వారు కళామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి వేదికపై జ్యోతి ప్రజల్వన గావించి మాయాబజార్ నాటకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అటు నాటక రంగానికి, సినీ రంగానికి ఎన్నో కళలు నేర్పించిన సురభి నాటకాలు పులివెందుల గడ్డ కావడం ఎంతో గర్వకారణమన్నారు.

కళలకు పుట్టినిల్లు సురభి నాటకాలు కావడంతో మనందరం చేసుకున్న అదృష్టమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళా రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఆయనకు ఉన్న ఆసక్తితో పులివెందులలో మొట్టమొదటిసారిగా సురభి నాటకాలు ప్రదర్శించడం జరిగిందన్నారు. అందుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంతో ప్రోత్సహించారన్నారు. అనంతరం వైఎస్సార్ కళా రత్న అవార్డు గ్రహీత, వినాయక నాట్య కళామండలి నిర్వాహకులు వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళారంగాన్ని ఎంతో ప్రోత్సహిస్తున్నారని.. ఈ ప్రాంత వాసులుగా 8 తరాలుగా సురభి నాటకాలను నమ్ముకుని ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఇదే రంగంలో ముందుకు పోతున్నామన్నారు. అనంతరం మాయాబజార్ నాటక ప్రదర్శనను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, రాయలసీమ కాపునాడు అధ్యక్షుడు సోపాల వీరా, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు గుండె వైద్య నిపుణులు రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్షలకు హాజరయ్యేవారు పడగడుపున ఏమీ తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## వేడుకగా లక్ష తులసీ అర్చన

**వేంపల్లె :** స్థానిక మెయిన్ బజార్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయంలో లక్ష తులసీ అర్చన వేడుకగా నిర్వహించారు. శనివారం ధనుర్మాస పూజలలో భాగంగా ఆలయ అర్చకులు హరిప్రవీణ్, శేషగిరిరావులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి లక్ష తులసీ అర్చనలు చేశారు. తెల్లవారుజామున 4 గంటలకే మహిళలు భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## వేంపల్లెలో గడ్డి వామి దగ్ధం

**వేంపల్లె :** స్థానిక పియా తోట వీధి సమీపంలో ఉన్న గడ్డివామి దగ్ధమైంది. రూ. లక్ష ఆస్తి నష్టం జరిగింది. బాధితులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పియా తోట సమీపంలో నరెడ్డి మహేశ్వరరెడ్డి అనే రైతు పశువులకు మేత నిల్వ చేసుకోగా.. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే పూర్తిగా గడ్డి వామి కాలిపోయింది. ప్రభుత్వం తమను ఆదుకుని నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# ఆయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు


నల్లపురెడ్డిపల్లెలో అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



పార్నపల్లెలో అక్షింతలను ఊరేగిస్తున్న రామ భక్తులు

**పులివెందుల రూరల్ :** ఆయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను శనివారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో ఉన్న శివాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. గ్రామంలో భజనలు చేసుకుంటూ ఆయోధ్య రాముని అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో భజనల కార్యక్రమాన్ని చేపట్టారు.

**లింగాలలో..**

**లింగాల :** మండలంలోని పార్నపల్లెలో అయోధ్య రాముల వారి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని రామ భక్తులు శ్రీరామ భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్య బాలరాముని అక్షింతలు ఎంతో పవిత్రమైనవని వాటిని వేద పండితులు చెప్పిన విధంగా వినియోగించాలని రామ భక్తులు ప్రజలకు తెలిపారు.

# జమ్మలమడుగు పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు


పట్టణంలో ఎక్కువ ప్రమాదాలు జరిగే గాంధీ సర్కిల్

**జమ్మలమడుగు :** పట్టణంలోని ప్రజలు ట్రాఫిక్ కష్టాలతో ఇబ్బందులు పడుతున్నారు. పాత బస్టాండ్‌లో ఎక్కువ సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. చిరు వ్యాపారులు సైతం రోడ్డ పక్కనే వ్యాపారాలు చేసుకోవడంతో ఏ వాహనం ఎటు వైపు నుంచి వస్తుందో అర్థం కాని పరిస్థితి. దీంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద స్కూటరిస్టును లారీ ఢీ కొనడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కుటుంబ సభ్యులతో వెళ్తున్న కారు గాంధీ విగ్రహం వద్ద స్కూటర్‌ను ఢీకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు పాత బస్టాండ్ నుంచే వెళ్లవలసి ఉంది. ఆర్టీసీ బస్సులు ప్రొద్దుటూరు, కడప, తిరుపతి, చెన్నై, బెంగుళూరు, తాడిపత్రి, కర్నూల్, హైదరాబాద్, ముద్దనూరు వైపు వెళ్లే వాహనాలు అన్ని ఈ రోడ్డు ద్వారా వెళ్తాయి. దీంతో నిత్యం వందల కొద్ది వాహనాలు తిరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు


బహుమతిని అందిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

**పులివెందుల టౌన్ :** సంక్రాంతి సంబరాలలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి బహుమతి వై.నాగలక్ష్మి, రెండవ బహుమతి పి.పూజిత, మూడవ బహుమతి కె.నందిని, నాల్గవ బహుమతి జి.తనూజ, 5వ బహుమతి బి.లక్ష్మిదేవిలు పొందగా.. వారికి బహుమతులను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్‌లు ప్రదానం చేశారు. అలాగే ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

**చెన్నూరులో..**

**చెన్నూరు :** యూత్ లాఫింగ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు చెన్నూరు పార్కులో నిర్వహించిన వాలీబాల్ పోటీలను నిర్వాహకులు ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ.5వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు నిర్ణయించారు. 14వ తేదీ భోగి పండుగను పురస్కరించుకుని స్థానిక శివాలయంలో చిన్నపిల్లలకు భోగిపండ్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ముగ్గుల పోటీలు, ఐదు గంటలకు స్లో సైక్లింగ్ రేస్ పోటీలు, 6 గంటలకు లెమన్ స్పూన్ గేమ్ పోటీలు, ఏడు గంటలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు ఏర్పాటు చేశారు. 15వ తేదీ ఉట్టి కొట్టే కార్యక్రమం, శివాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 16వ తేదీ శివాలయం వీధి నుంచి మహిళలచే గొబ్బెమ్మ అమ్మవార్లను పెన్నా నది వరకు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# క్రీడలలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలి


క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైఎస్ మధురెడ్డి, తదితరులు


వేంపల్లెలో క్రికెట్ క్రీడాకారుడు గౌతమ్‌కు నగదు బహుమతిని అందిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్, ఎంపీపీ తదితరులు

**తొండూరు :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఊడవగండ్ల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం క్రికెట్ క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలు ఈనెల 20వ తేదీవరకు జరుగుతాయని.. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, గంగిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

**క్రీడలతో మానసిక ఆరోగ్యం**

**వేంపల్లె :** క్రీడల ద్వారా మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ లక్ష్మీగాయత్రి, వేంపల్లె సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి ఎంపీడీఓ దివిజా సంపతి ఆధ్వర్యంలో వేంపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీలలో క్రికెట్‌లో వేంపల్లె సెవెన్ విజేతగా నిలిచిన వారు బహుమతులు అందుకున్నారు. మొదటి స్థానంలో ఏడవ సచివాలయం గాజులపేట జట్టు, రెండవ స్థానంలో కత్తలూరు గ్రామానికి జట్టు నిలిచాయి. వీరివురికి సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు సొంత నిధులతో నగదు అవార్డును అందజేశారు. ఇక్కడ గెలిచి విజేతలుగా నిలిచిన జట్లు నియోజకవర్గస్థాయి క్రీడలలో ఆడనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు మణిగోపాల్‌రెడ్డి, భారతి, వార్డు మెంబర్ బండల షుకూర్, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# మండపం నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**కమలాపురం :** పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తన సొంత నిధులు రూ.6,01,116 లతో నిర్మిస్తున్న మండపానికి భూమి పూజ చేశారు. శనివారం ఆలయ గురుస్వామి కైపా నరసింహప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో బాణా సంచా పేల్చుతూ పూర్ణ కుంభంతో ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మండపం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో తమ కుటుంబ సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, ఆర్‌పీఎస్‌ఆర్, ఎస్‌సీ పుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, నిఖిల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మస్తానయ్య, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం


ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**జమ్మలమడుగు :** గూడెంచెరువు గ్రామంలోని ఇళ్లులేని నిరుపేదలకు ఇచ్చిన హామీని ఇంటి పట్టాలను ఇచ్చి నెరవేర్చామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం గూడెంచెరువు గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలైన 92 మంది లబ్ధిదారులకు ఆయన పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చారు కానీ స్థలాలు చూపలేదని వారు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అధికారులతో గూడెంచెరువు గ్రామంలోనే ఇంటి స్థలాలకు ప్లాట్‌లు వేయించి వారి పేరుమీద పట్టాలను మంజూరు చేశామన్నారు. ఇళ్లులేని నిరుపేదలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలాలు మంజూరు చేస్తున్నారన్నారు. ఇప్పటికే అంబవరంలోని జగనన్న కాలనీలో దాదాపు ఐదువేల మందికి పొన్నతోట పంచాయతీలోని ఆర్‌అండ్ కాలనీ సమీపంలో మండలంలోని మోరగుడి వాసులకు ఇంటి స్థలాలతోపాటు ఇళ్లను మంజూరు చేశామన్నారు. ప్రజలు మంచి చేసే వారికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీటీ వెణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 25 కుటుంబాలు చేరిక


ఉప్పలూరులో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ముద్దనూరు :** మండలంలోని ఉప్పలూరు గ్రామంలో 25 కుటుంబాలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పలూరుకు చెందిన రాయపాటి దస్తగిరి, రాయవరం గురు వేదవ్, పవన్, రామ్మోహన్, రవి, సుబ్బయ్య, నాగరాజు, బాబు, వీరయ్య, రమణయ్యలతో కలసి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. వారిని ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శనివారం ఉప్పలూరు గ్రామంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల ద్వారా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నామని, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గీతా సారాంశం అందరికీ ఆదర్శనీయం

**పులివెందుల టౌన్ :** భగవద్గీత సారాంశం అందరికి ఆదర్శనీయమని గీతా గాన ప్రవచన ప్రచారకర్త, భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎల్వీ గంగాధర శాస్త్రి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న శ్రీకృష్ణాలయంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా శ్రీకృష్ణ గీతామృతం, గీతా సందేశం అందించేందుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు రామమనోహర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం ఆయన భగద్గీతలోని గీతామృతాన్ని వివరిస్తూ, విశిష్టతను, శ్లోకాలతో వివరిస్తూ అర్థ తాత్పార్యాలను వివరించారు.

## కాఫర్‌వైరు చోరీ

**కొండాపురం :** బ్రాహ్మణపల్లెకు చెందిన రంగనాయకులు మెరపతోటలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి కాఫర్ వైరు ఎత్తుకెళ్లారు. తోటల్లో నీటి తడులు కట్టుకోవడానికి వీలు లేక చాల ఇక్కట్లు పడుతున్నామని పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.